
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ప్రఖ్యాత శబ్దగ్రాహక నిపుణుడు, వెండి తెరమీద బొమ్మలచేత మాట్లాడించే అజ్ఞాత వీరుడు

## శ్రీ వల్లభ జోశ్యుల శివరాం (బి.ఎస్.సి.)



**మాటలు వినిపిస్తూ,** వెండి తెరమీద బొమ్మ కనిపించకపోయినా థియేటర్లో ఎక్కువ సేపు కూర్చోగలంకాని, పాత్రధారుల పెదవులు మాత్రం కదులుతూ, వాళ్ళ మాటలు వినిపించకపోతే అట్టే సేపు భరించలేం. 1932లో 'ఆలం ఆరా ' తొలి టాకీ చిత్రం విడుదలైనప్పట్నించి ప్రేక్షకులు వెండి తెరమీద బొమ్మలు చూడడంతోపాటు – మాటలు, పాటలు, తదితర ధ్వనులు వినడానికి అలవాటుపడిపోయారు. వాస్తవానికి టాకీ చిత్రాలతో చలన చిత్ర పరిశ్రమలో ఒక విప్లవం ఏర్పడింది.

ఒక్క ముక్కలో చెప్పాలంటే వెండి తెర మీద కనిపించే బొమ్మలకు ప్రాణం పోసేది శబ్దగ్రాహకుడు. అయినా, ఈనాడు చిత్ర నిర్మాణంలో శబ్దగ్రాహకునికి ఇవ్వబడుతున్న స్థానం గురించి ఆలోచిస్తే ఎంతైనా ఆశ్చర్యం కలగక మానదు. శబ్దగ్రాహకుడు సెట్‌లోని హడావిడికి దూరంగా ఓ మూల కూర్చోవడం అందుకు మొదటి కారణం కావొచ్చు.

సెట్‌మీద ఏదైనా దృశ్య చిత్రీకరణ తృప్తికరంగా లేకపోతే, మళ్ళీ రీ షూట్ చేస్తారు. ఆ షాట్ సవ్యంగా వచ్చేవరకు ఎన్నో రీ టేక్‌లు చేస్తారు. కాని, సౌండ్ విషయం వచ్చేసరికి ఈ రీ టేక్‌ల విషయాన్ని అంతగా పట్టించుకోరు. "షాట్ ఓ.కే!

సౌండ్‌ను తర్వాత డబ్ చేసి సరిచేసుకోవచ్చు." అని దర్శకుడు అనడం పరిపాటి. నిజమే. సౌండ్‌ను మాత్రం తర్వాత ఎప్పుడంటే అప్పుడు ఎలాగైనా రికార్డ్ చేసి దృశ్యంతో జోడించుకోవచ్చుగాని, షాట్ బాగా రాకపోతే మళ్ళీ సెట్ వేసి షూట్ చెయ్యడం అధిక వ్యప్రయాసలతో కూడిన పనే.

హాలివుడ్‌లో పాత్రధారులు సహజధోరణిలో అంటే మామూలు స్థాయిలో మాట్లాడ్తారు. అక్కడ స్టూడియోలలో అత్యాధునిక యంత్ర పరికరాలు ఉంటాయి. సౌండ్ ప్రూఫ్ సెట్‌లు ఉన్నందువల్ల సంభాషణలను మాత్రమే నిర్దుష్టంగా రికార్డ్ చేయడానికి వీలుంది. కాని, మన దేశంలో అన్ని సదుపాయాలు లేవు. మన ఆర్టిస్టులు స్పష్టంగా ప్రతి మాటా వినిపించేలా ఎలుగెత్తి మాట్లాడాలి. ఆ మాటలను అదే స్థాయిలో గ్రహించేలా మైక్రోఫోన్‌ను సెట్‌లో అమర్చాలి. పైగా, ఫ్రేమ్ లో ఆ మైక్ కనిపించకుండా జాగ్రత్త పడాలి.

సెట్‌లో ఛాయాగ్రాహకుడు లైటింగ్ వగైరాలన్నీ తనకు కావలసిన విధంగా అమర్చుకుని, ఫీల్డులో మైక్ కనిపించకుండా జాగ్రత్త వహిస్తాడు కాని, ఆ మైక్ పాత్రధారులకు దూరంగా మరీ ఎత్తున ఉంటే రికార్డ్ చేయడంలో ఉండే సాధక బాధకాల గురించి తను అట్టే పట్టించుకోడు.

మన ఫ్లోర్‌లు సౌండ్ ప్రూఫ్‌వి కావు. ఫ్లోర్‌ల మీద ఒక్కోసారి కాకులు అరుస్తూంటాయి. ఆ కాకులను తోలి, అవి పోయాక షూటింగ్ సాగించడమంటే మాటలు కావు. పైగా కెమెరాలో ఫిలిం తిరుగుతున్నప్పుడు ఏర్పడే రొద ఒకటి. అంచేత, ఇలాంటి అనవసరమైన ధ్వనులతో పాటు పాత్రధారుల మాటలను రికార్డ్ చేసి, అటుపైన ఆ మాటలు మాత్రం వినిపిం చేలా మిగతా అనవసరమైన ధ్వనులను తొలగించడం శబ్దగ్రాహకునికి ఒక కఠిన పరీక్ష.

ఎక్కడ ఏ మాత్రం పొరబాటు జరిగినా పాత్రధారుల సంభాషణలు పాడైపోయే ప్రమాదం లేకపోలేదు. కర్ణకఠోరంగా ఉన్న కంఠాన్ని మధురాతి మధురంగా, బొంగురుపోయినట్లున్న కంఠాన్ని శ్రావ్యంగా స్పష్టంగా వినిపింపచేసే నైపుణ్యం శబ్దగ్రాహకుని చేతిలో ఉంది. వాల్యూం కంట్రోల్స్, అటెన్యుయేటర్స్, ఫిల్టర్స్ సాయంతో ఇలా కీచు గొంతులను సైతం క్రమంగా వినిపింపచేయవచ్చు. కాని, ఈ సవరింపులు కూడా పరిమితమైనవే.

ముఖ్యంగా పాటల రికార్డింగ్‌లో శబ్దగ్రాహకుని ప్రతిభా విశేషాలు స్పష్టంగా ద్యోతకమవుతాయి. కొన్ని వాద్యాలు మైక్‌కు ఎంతో దూరంలో లేకపోతే గాయనీ గాయకుల గాత్రాలను అమాంతంగా మిగేస్తాయి.

కొందరు నిర్మాతలు తమ వీలునుబట్టి వివిధ స్టూడియోలలో షూటింగ్‌లు జరుపుతారు. ఛాయాగ్రాహకుడు ఒకడే అవడం వల్ల దృశ్యం చిత్రీకరణలో అంత తేడా కనిపించదు గాని, ఒక్కో స్టూడియోలో ప్రత్యేకంగా ఒక్కో శబ్ద గ్రాహకుడు ఉండడంవల్ల శబ్దగ్రహణంలో ఇంతో అంతో తేడా కనిపించే అవకాశం లేకపోలేదు. కాని, అలా తేడా ఏ మాత్రం కనిపించకుండా చూసే బాధ్యత కూడా శబ్దగ్రాహకుని మీదే ఉంది.

ప్రతి సన్నివేశం రక్తి కట్టేలా చేయడానికి రీరికార్డింగ్ ఘట్టంలో శబ్దగ్రాహకుడు ఎంతో ముఖ్యమైన పాత్ర వహిస్తాడు. వివిధ సౌండ్ ట్రాక్‌లు, సౌండ్ ఎఫెక్ట్‌లు, సంభాషణలు, సంగీతం అన్నీ తగుపాళ్ళలో కలపడం ఆ ఘట్టంలో జరుగుతుంది. ఇక్కడ ఏ మాత్రం లోపం సంభవించినా వెండితెర మీద ఒక సన్నివేశం తాలుకు వాతావరణం పూర్తిగా దెబ్బతిని అంతా రసాభాస అవుతుంది. అంచేత ఈ రీరికార్డింగ్ ఎంతో ఓపికతో, తాపీగా జరగలవసిన పని. కాని, ఇటీవల కొన్ని చిత్రాలలో రీరికార్డింగ్‌కు అట్టే ప్రాముఖ్యత ఇవ్వబడడంలేదు. కొందరు నిర్మాతలు వాళ్ళ చిత్రాల విడుదల తేదీలను హఠాత్తుగా నిర్ణయించి, ఆ తేదీలకు నాలుగైదు రోజుల ముందు నించే హడావిడిగా రీరికార్డింగ్ ప్రారంభిస్తారు. రెండు మూడు షిఫ్టులలోనే పూర్తిచేయించడానికి ఆదుర్దాపడతారు. శబ్దగ్రాహకునికి ఇది మరొక విషమ పరీక్ష. చెప్పొచ్చేదేమిటంటే ఒక చిత్రాన్ని సెట్ మీద తయారు చేయడానికి రెండు మూడేళ్ళ వ్యవధి పట్టినా ఓపిక వహించే నిర్మాత ఈ రీరికార్డింగ్‌కు కొన్ని రోజుల వ్యవధి ఎందుకు ఇవ్వడో తలచుకుంటే, ఎవరికైనా ఆశ్చర్యం వేయక మానదు.

శబ్దగ్రహణంలో ఎదురయ్యే ఈ అతీతమైన సాధక బాధకాలను మన శబ్దగ్రాహక నిపుణులు ఏనాడో అధిగమించారు. పైపెచ్చు శబ్దగ్రహణంలో ఉన్నత ప్రమాణాలు సాధించాయి విజయా – వాహినీ స్టూడియోలు.

ఇప్పుడు ఆ స్టూడియోల సౌండ్ రికార్డింగ్ ఛీఫ్ అయిన శ్రీ వల్లభజోశ్యుల శివరాం బి.ఎ, బి.ఎస్.సిగారు తొలుత నటుడుగా సినిమారంగంలో ప్రవేశించడం ఆశ్చర్యకరమైన విషయమే అయినా అదీ అంచెల వారీగా ఆయన చేసిన కృషిమీద ఆధారపడి ఉంది.

శ్రీ శివరాం 1917 నవంబర్‌లో గుంటూరులో జన్మించారు. చిన్నప్పుడే చదువు సంధ్యలతోపాటు లలిత కళలూ ఆయనను ఆకర్షించాయి. నాలుగో తరగతి చదువుతున్నప్పుడే ఎమ్మిగనూరులో ప్రదర్శింపబడిన 'భక్తప్రహ్లాద' నాటకంలో ఆయన 'ప్రహ్లాదు'డుగా తొలిసారిగా ముఖానికి గ్రీస్ పెయింట్ పులుముకున్నారు. అటుపైన అడపాదడపా హైస్కూల్ వార్షికోత్సవాలలో కబీర్, భీముడు ఇత్యాది పాత్రలు ధరించారు. పాటలు కూడా పాడేవారు. ఆయనకు సంగీతంలోనూ కాస్తో కూస్తో ప్రవేశముంది. సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు మహావాది వెంకటప్పయ్యగారి వద్ద కొంతకాలం శిష్యరికం చేశారు. తాళిపడగ శేషయ్యగారు ఎంతో ప్రోత్సాహమిచ్చారు.

1938 బిలో.ఎ చదువుతూండగా శ్రీ శివరాముకు నేటి సుప్రసిద్ధ దర్శకులైన శ్రీ కమలాకర కామేశ్వరరావుగారితోనూ, ఆయన మూలంగా ప్రఖ్యాత దర్శకులు శ్రీ బి.ఎన్.రెడ్డిగారి పరిచయమూ లభించింది. కాని, శ్రీ శివరామును తొలుత వెండి తెరకు పరిచయం చేసిన ఘనత శ్రీ కె.వి రెడ్డిగారికే దక్కింది. వాహినీ వారి 'పోతన'లో శివరాం మల్లన్నగా అత్యద్భుతంగా నటించారు. అదే ఆయన అన్నగారైన డాక్టరు శర్మగారు కూడా సింగభూపాలుడుగా నటించారు. అటుపైన కొల్హాపూర్‌లో పి.పుల్లయ్యగారి దర్శకత్వంలో తయారైన "మాయామశ్చీంద్ర"లో శ్రీ శివరాం

రాజకుమారుడిగా నటించారు. దరిమిలా మరే అవకాశమూ లభించకపోవడంతో తిరిగి గుంటూరు వెళ్ళి, అక్కడ ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో మూడేళ్ళపాటు డిమాన్‌స్ట్రేటర్‌గా పని చేశారు.

అప్పుడు ఆ కాలేజీలో శ్రీ ఎన్.టి.రామారవు, జగ్గయ్య విద్యార్థులు. ఆ రోజుల్లోనే శ్రీ శివరాం శ్రీ ముక్కామల కృష్ణమూర్తిగారితో కలిసి, "నవజ్యోతి నాటక సమతి" స్థాపించారు. ఆ నాటక సమితి ప్రదర్శించిన "భక్త కబీరు, శాక్రిఫైస్, కొండవీటి యుద్ధం" మరి కొన్ని ఆంగ్ల ఏకాంకిక నాటికలలోనూ శివరాం ప్రముఖ పాత్రలు కూడా రంగస్థలం మీద చక్కగా ఒప్పించారు. ఈయన అభిమాన పాత్ర 'షైలక్.'

వాహినీ స్టూడియో నెలకొల్పబడ్డప్పుడు 1947 డిసెంబర్ ప్రాంతంలో శివరాం అక్కడ సౌండ్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌గానూ, రికార్డిస్ట్‌గానూ చేశారు. ఆయన రికార్డ్ చేసిన తొలి చిత్రం భరణీవారి "లైలా మజ్ను," అనంతరం "స్వప్న సుందరి, మాయారంభ, షాహుకారు, పాతాళభైరవి, పెళ్ళిచేసి చూడు" ఇత్యాది విజయావారి చిత్రాలకూ, తదితర సంస్థల చిత్రాలకూ పనిచేశారు. ఇలా సౌండ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తూనే మరోవంక వీలు చిక్కినప్పుడల్లా శివరాం తెరమీద కనిపించసాగారు. 1948లో వాహినీవారి "గుణసుందరి కథ" చిత్రంలో శాపవిమోచనం పొందిన కథానాయకుడుగా ఆయన నటించారు. అటుపైన "షావుకారు, దీక్ష, విప్రనారాయణ, గులేబకావళి, సీతారామ కల్యాణం, మంచీ – చెడూ, మంచి మనసులు"ఇటీవల విడుదలైన "లవకుశ" చిత్రంలోనూ శివరాం నటించారు.

1955లో ఛీఫ్ సౌండ్ రికార్డిస్ట్ అయి, 1962 నించి వాహినీ స్టూడియో సౌండ్ డిపార్ట్‌మెంట్‌కు అధిపతి అయ్యారు.

"ప్రతి సన్నివేశం రక్తి కట్టించడానికి – చిత్రకథ, ఆయా వాతావరణాలు ఇత్యాది విషయాల గురించి సౌండ్ రికార్డిస్ట్‌కు క్షుణ్ణంగా ముందే తెలిసి ఉండడం అతి ముఖ్యం. చిత్ర దర్శకుడు, చిత్ర కథా రచయితలు శబ్దగ్రాహకునితో సంప్రదించి తగు సహకారమిచ్చినప్పుడే మన చిత్రాలలో ఉన్నత ప్రమాణాలను సాధించి తీరగలం" అని శివరాంగారు అనడంలో అతిశయోక్తి ఏమీలేదు.

తెలుగు సినిమారంగానికి గర్వకారణమైన శివరాంలాంటి ఆరితేరిన సాంకేతిక నిపుణులను పరిచయం చేసి ప్రోత్సహిస్తూన్న విజయా, వాహినీ అధినేతలు ఎంతైనా అభినందనీయులు.

Post your comments